ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
గురువారం 21 నవంబరు 2024



వాణిజ్య సరళిలో వ్యవసాయం చేయాలి

బొంరాస్‌పేట్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రైతు ఆదాయం రెట్టింపు కావాలంటే వ్యవసాయాన్ని వాణిజ్య సరళిలో చేపట్టాలని పాలెం వ్యవసాయ కళాశాల డీన్ పుష్పవతి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో కళాశాల విద్యార్థులు నిర్వహించిన రైతు సదస్సులో ఆమె మాట్లాడారు. వ్యవసాయంలో ఎప్పటికప్పుడు ఆధునికీకరణ విధానాలను అనుసరించాలన్నారు. పంటను ప్రాసెస్ చేసి మార్కెటింగ్ చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని ఆమె తెలిపారు.

నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు

పొదలతో నిండిన మైదానాలు



నిర్వహణను గాలికొదిలేసిన పంచాయతీ సిబ్బంది 8
కొడంగల్ మండలంలో అస్తవ్యస్తం

ఆలయాలకు పాలకమండళ్లు

నియామకానికి నోటిఫికేషన్



ఏడాది గడువుతో కమిటీల ఏర్పాటు
ప్రారంభమైన నామినేటెడ్ పదవుల పందేరం 7

సర్వర్‘డౌన్’

‘టెట్’ దరఖాస్తు ప్రక్రియలో అవస్థలు



నిలిచిపోయిన పేమెంట్ ప్రాసెస్ 7
నిన్నటితో ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
గడువు పెంచాలని అభ్యర్థుల వేడుకోలు

జిల్లాలో నేడు

కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

రంగారెడ్డి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లపై గురువారం కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు రంగారెడ్డి జిల్లా, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4 గంటల వరకు వికారాబాద్ జిల్లాకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషన్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో కల్పించనున్న రిజర్వేషన్లపై అభిప్రాయాలను, సూచనలను, సలహాలను తెలిపేందుకు ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

బొంరాస్‌పేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, లగచర్ల రైతులకు న్యాయం చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం లగచర్లలో రైతులతో మాట్లాడేందుకు వెళ్తున్న సంఘం నాయకులను పోలీసులు బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ప్రభుత్వం ఉద్యమాన్ని ఆపలేదన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాలాజీనాయక్, వెంకట్, లోకేష్‌నాయక్ పాల్గొన్నారు.



నారాయణపూర్ శివారులోని భూదాన్ భూమిలో ఏర్పాటు చేసిన స్టీల్ ఫ్యాక్టరీ

భూదాన్ భూముల చెర!

పరిగి మండలంలో 32 ఎకరాలు స్వాహా

భూమి లేని నిరుపేదలకు దక్కాల్సిన భూదాన్ భూములు బడాబాబుల చేతుల్లో బందీ అయ్యాయి. కోట్లు విలువ చేసే భూములను భూబకాసురులు అనుభవిస్తున్నారు. రికార్డులు తారుమారు చేసి ఒకరి నుంచి మరొకరికి పట్టాలు మార్చి ఏమార్చారు. అసైన్‌మెంట్ భూములను వారసత్వంగా అనుభవించవచ్చు. కానీ, అమ్మడానికి వీలు లేదు. అయితే ఇక్కడ నిబంధనలు విరుద్ధంగా బడాబాబుల ఆధీనంలోకి వెళ్లాయి. రికార్డులను చెరిపి ఒకరి, ఇద్దరి పేర్లపై మార్పిడి చేసి దక్కించుకున్నారు. పరిగి మండలం నారాయణపూర్ గ్రామంలో పేదలకు దక్కాల్సిన 32.32 ఎకరాల భూములను మాయ చేసి స్వాధీనం చేసుకున్నారు. అక్కడ దర్జాగా పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని లాభాలు గడిస్తున్నారు. మోసపోయామని తెలుసుకున్న బాధిత రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా లాభం లేకుండా పోయింది.

- పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న బడాబాబులు
- మాయమాటలతో మోసపోయిన లబ్ధిదారులు
- న్యాయం కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- ఈ భూముల విలువ రూ.80 కోట్లపై మాటే



రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు(ఫైల్)

పరిగి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం నారాయణపూర్ గ్రామంలో సర్వేనంబర్లు 143, 144, 145లు పూర్తిగా భూదాన్ భూములే ఉన్నాయి. 143లో 14.15 ఎకరాలు, 144లో 13.13 ఎకరాలు, 145లో 5.04 ఎకరాల భూమి భూదాన్ బోర్డు భూములే. ఈ సర్వే నంబర్లలో మొత్తం 32.32 ఎకరాలు ఉంది. ఈ భూములన్ని ఖాస్రా, శేత్వార్ రికార్డులలో బెన్నూరు చెన్నప్ప, శంకరప్ప పేరిట వస్తుంది. 1975 తర్వాత భూదాన్ బోర్డు పరిధిలోనికి వెళ్లింది. అప్పట్లో 1976లో 32.32 ఎకరాల భూములను నారాయణపూర్ గ్రామానికి చెందిన ఏడు మంది జి.పాపన్న, రామయ్య, లాలుఅహ్మద్, ముసలయ్య, మాల అంతన్న, టి.రామన్న, కె.ఎల్లన్నకు భూదాన్ బోర్డు ద్వారా కేటాయించారు. వీరంతా గత ముప్పై ఏళ్లపాటు పంటలు సాగు చేసుకుంటూ వచ్చారు. భూదాన్ బోర్డు ద్వారా పేదల పంపిణీ చేసిన తర్వాత 30 ఏళ్లపాటు పేదలు

మిగతా 8వ పేజీలో...

పీఎస్‌లో సేవలు భేష్

శామీర్‌పేట పీఎస్‌ను సందర్శించిన డీజీపీ జితేందర్



డీజీపీ జితేందర్‌కి స్వాగతం పలుకుతున్న పోలీస్ సిబ్బంది

మూడుచింతలపల్లి, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో అందిస్తున్న సేవలు భేష్‌గా ఉన్నాయని డీజీపీ జితేందర్ కితాబిచ్చారు. ఆయన బుధవారం సాయంత్రం ఆకస్మికంగా పీఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనాథ్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. పీఎస్ పరిసరాలను పరిశీలించిన డీజీపీ మాట్లాడుతూ పచ్చదనంతో కళకళలాడుతుందన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ రాములు, ట్రాఫిక్ ఏసీపీ వెంకటిరెడ్డి, డీఐ గంగాధర్, ట్రాఫిక్ సీఐ హన్మంత్‌గౌడ్, ఎస్‌ఐలు హారిక, పరుశురాంనాయక్, దశరథ్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన



గిరిజన నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

పరిగి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్నారని పౌర హక్కుల, గిరిజన సంఘం నాయకులు ఆరోపించారు. లగచర్ల రైతులను కలిసేందుకు వెళ్తున్న నిజనిర్ధారణ కమిటీ బృందాన్ని బుధవారం పరిగి పోలీసులు అరెస్ట్ చేశారు. సేవాలాల్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు బుక్య సంజీవ్‌నాయక్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరావు, ఏబీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్, ఓయూ జేఏసీ నెహ్రూనాయక్, రైతు సేవసంఘం అధ్యక్షుడు కిషన్‌నాయక్, సేవాలాల్‌సేన శంకర్‌నాయక్ తదితరులను గడిసింగాపూర్ వద్ద అరెస్ట్ చేసి పరిగి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ- రైతుల అభిమతానికి విరుద్ధంగా భూసేకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. బలవంతపు భూ సేకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో శంకర్‌నాయక్, రవినాయక్, హరినాయక్, గోపాల్, చవాన్ ఉన్నారు.



అన్నీ అప్పులే.. ఆస్తుల్లేవ్

సమగ్ర సర్వేలో వస్తున్న సమాధానాలివే

- ఆధార్, అప్పుల వివరాలు మాత్రమే వెల్లడి
- మిగతా ప్రశ్నలను దాటవేస్తున్న ప్రజలు
- సర్వేలో ఎన్యూమరేటర్లకు తప్పని తిప్పలు
- సర్వేపై అవగాహన కల్పించడంలో విఫలం

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజల నుంచి వస్తున్న సమాధానాలతో ఎన్యూమరేటర్లకు తిప్పలు తప్పడం లేదు. ప్రజల నుంచి వచ్చే సమాధానాలతో అవాక్కవుతున్నారు. ముఖ్యంగా ఆస్తుల విషయంలో వచ్చే సమాధానాలతో ఏమీ చేయలేక వారు చెప్పిందే రాసుకుంటున్నారు. సొంత ఆస్తులు లేవని.. అప్పులు మాత్రం ఉన్నాయని చెబుతుండటం గమనార్హం. కళ్లెదుటే సొంత భవనాలు, వాహనాలు కనిపిస్తున్నా అవి తమవి కాదంటూ చెబుతున్న సమాధానాలతో ఎన్యూమరేటర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయినా చేసేదేమీ లేక చెప్పింది నోట్ చేసుకుంటున్నారు.

సర్వేకు సహకరించని జనం

సమగ్ర కుటుంబ సర్వేలో పూర్తి వివరాలు ఇవ్వకపోవడంతో సర్వే ఎందుకని వారు వాపోతున్నారు. ఆధార్ కార్డు నంబర్లు, ఫోన్ నంబర్లు, రుణాలు వంటి సమాచారాలు మాత్రమే నిజంగా చెబుతున్నారు. ఆస్తులు, ఇళ్లు, కార్లు వంటి సమాచారం మాత్రం తెలుపడం లేదు. మరికొందరైతే ఏకంగా ముఖం మీదనే తిడుతున్నారని, సర్వేతో మాకేం పని, ప్రభుత్వం నుంచి మాకేం అవసరం లేదంటూ సర్వేకు

మిగతా 8వ పేజీలో...



ప్రచార కళాయాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రచార కళాయాత్రను విజయవంతం చేయాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ప్రచార కళాయాత్ర కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళారం ప్రజాపాలన విజయోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో కళాయాత్ర వాహనాన్ని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయోత్సవాల్లో భాగంగా జిల్లాలోని తెలంగాణ సాంస్కృతిక కళాకారులు నేటి నుంచి డిసెంబర్ 7 వరకు ప్రతీ రోజు 3 గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై పాటలు, కళా ప్రదర్శనల ద్వారా ప్రచారం నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై గ్రామ, మున్సిపల్ వార్డుల్లో విస్తృతంగా టీఎస్సెస్ కళాకారులు తమ ఆటాపాటల ద్వారా అవగాహన కల్పించడం ఈ కళాయాత్ర ప్రధాన లక్ష్యమన్నారు. విజయోత్సవ కళాయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో కృష్ణవేణి, సాంస్కృతిక శాఖ కళాకారుల బృందం, జిల్లా పౌర సంబంధాల కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25న అనంతగిరి ప్రదక్షిణ



వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస ఉత్సవాలు ముగింపు రోజు నిర్వహించే అనంతగిరి ప్రదక్షిణ కార్యక్రమం ఈనెల 25న నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక వేత్తలు, నిర్వాహకులు పేర్కొన్నారు. రాజీవ్‌నగర్ కాలనీలోని భవానీమాతా ఆలయం వద్ద ఉదయం 5.40 గంటలకు ప్రారంభమైన శుభం పంక్షన్‌హాల్ మీదుగా గోదుంగూడ చేరుకుంటుందని, అక్కడి నుంచి జైదుపల్లికి ఉదయం సమయం 9 గంటలకు కేరెళ్లి సత్యసాయి విజ్ఞాన కేంద్రంలో ఉపాహారం ఉంటుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి బుగ్గ రామలింగేశ్వర క్షేత్రంలో భోజన ప్రసాదం అనంతరం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వకు బండబావి హనుమాన్ దేవాలయం మీదుగా పుష్కరిణి వరకు గిరి ప్రదక్షిణ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. చివరగా సాయంత్రం 5.30 గంటలకు స్వామి దర్శనం చేసుకుంటారని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

మోమిన్‌పేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు సంఖ్యను పెంచాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ డాక్టర్లకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు గ్రామాల్లో అందుబాటులో ఉండి ఆరోగ్యంపై ప్రజలకు సలహాలు, సూచనలు చేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు సుజల జయ్, బుచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఏవో మోహన్‌రెడ్డి

పంట వివరాలను నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

బషీరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యాసంగి పంట సాగు వివరాలను రైతులు విధిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించిన ఆయన రైతులతో చర్చిస్తూ పలు సూచనలు చేశారు. అనంతరం బషీరాబాద్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజస్టర్లను పరిశీలించి ఏఏ మందులు అందుబాటులో ఉంచారనేదానిపై ఆరా తీశారు. కాశీంపూర్ గ్రామ సమీపంలోని వరి ధాన్యం కేంద్రాన్ని పరిశలించిన ఆయన అక్కడి నిర్వాహకులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని సూచించారు. అనంతరం మారుతి జిన్నింగ్ మిల్లును సందర్శించిన ఆయన అక్కడున్న రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోలు చేయాలని సీసీఐ అధికార, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏఈవో నవీన్, తదితరులు ఉన్నారు.

వణికిస్తున్న చలి

- ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు
- మర్పల్లిలో 10.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



రంగారెడ్డి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి పంజా విసురుతోంది. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో చలిగాలుల తీవ్రత పెరిగి పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం వికారాబాద్ జిల్లా మర్పల్లిలో అత్యల్పంగా 10.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లిలో 11.0 డిగ్రీలు, నమోదు కాగా, మేడ్చల్ జిల్లా 13.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

అందరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలని మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల జిల్లాస్థాయి ముగింపు కార్యక్రమం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పుస్తక పఠనాన్ని ప్రతీ ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. ప్రతి మండలంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేద్దామని, ఇప్పటికే జిల్లాలోని 17 గ్రంథాలయాల్లో 3.10లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా గ్రంథాలయంలో పుస్తక పఠనం, పోటీపరీక్షల మెటీరియల్ చదివి ఎంతోమంది ఉద్యోగాలు సాధించారన్నారు. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌లతో కలిసి గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు విడుల చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, కార్యదర్శి సురేష్‌బాబు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు ముత్తహార్ షరీఫ్, మహిపాల్‌రెడ్డి, మల్లేశ్, ఆసిఫ్, సంతోష్ పాల్గొన్నారు.

యాచారం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లిలో మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణం కోసం తనవంతు సహకారమందించనున్నట్లు

ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం


ఎమ్మెల్యే మల్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న మేడిపల్లి యాదవ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. బుధవారం మేడిపల్లి యాదవ సంఘం నాయకులు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆలయ నిర్మాణం విషయమై మాట్లాడారు. త్వరిగతిన నిర్మాణం పూర్తిచేసేందుకు సహకారమందించనున్నట్లు మల్‌రెడ్డి చెప్పారు. గ్రామాభివృద్ధికి విరివిగా నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. సురేష్, ముంత జంగయ్య తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రోడ్డు సర్వే పనులు

కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్కాన్‌పేట, బేగరికంచ గ్రామాల్లో నెలకొల్పనున్న ఫ్యూచర్‌సిటీ వరకు రోడ్డు సర్వే పనులు బుధవారం రాచులూరు రెవెన్యూ పరిధిలో పోలీసుల బందోబస్తు మధ్య కొనసాగాయి. కందుకూరు, మహేశ్వరం సీఐలు సీతారాం, వెంకటేశ్వర్లు పోలీసులను మోహరించి సర్వే కొనసాగించారు. తహసీల్దార్ కె.గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం రావిరాల ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్ 13 నుంచి మండలంలోని లేమూరు, అగర్‌మియాగూడ, తిమ్మాపురం, రాచులూరు, గుమ్మడవెల్లి రెవెన్యూ గ్రామాల మీదుగా బేగరికంచలో నెలకొల్పనున్న ఫ్యూచర్ సిటీ వరకు 330 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేయడానికి సర్వే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో సర్వే పూర్తిచేసి రైతులతో ఆర్డీవో అనంతరెడ్డి నేతృత్వంలో పరిహారం విషయాన్ని చర్చించనున్నట్లు తెలిపారు.

అగర్‌మియాగూడలో నేడు రైతులతో సమావేశం

ఫ్యూచర్ సిటీ వరకు రోడ్డుకోసం భూములు కోల్పోతున్న అగర్‌మియాగూడ రైతులతో నేడు(గురువారం) ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు రైతు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8.45 గంటలకు అగర్‌మియాగూడ రైతులతో ఇన్‌చార్జి ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్‌లు రైతులతో ముందుగా చర్చించాక సర్వే కొనసాగిస్తారని ఆయన తెలిపారు. అగర్‌మియాగూడ రైతులతో పాటు నగరంలోని రైతులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీఐ

శంకర్‌పల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్, ర్యాగింగ్, మైనర్లకు డ్రైవింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్‌తో పాటుగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు స్నేహ పూర్వకంగా మెలగాలని, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సుందరయ్య తదితరులు ఉన్నారు.

నాగసమందర్ పంచాయతీలో డీపీవో తనిఖీ

ధారూరు, నవంబరు 20: నాగసమందర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని నర్సరీ, వైకుంఠధామం, కంపోస్టు షెడ్, పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ స్థలంలో వేసిన డబ్బాను తొలగించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీవో షఫీవుల్లా ఉన్నారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలలోని పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఫరూఖ్‌నగర్ మండల శాఖ నాయకులు హైమద్ పాష, లాలయ్య, శివ, శ్రీశైలం, యాదయ్య, శివకుమార్, కృష్ణముదిరాజ్, రమేష్ ముదిరాజ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పాలకమండళ్లు

నియామకానికి నోటిఫికేషన్.. ఏడాది గడువుతో కమిటీల ఏర్పాటు


తాండూరులోని భావిగి భద్రేశ్వరస్వామి ఆలయం

తాండూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల రెండోదశ పందేరం మొదలైంది. ఇప్పుడు ఆలయాల పాలక మండళ్లను నియామకానికి ప్రక్రియ షురువైంది. 20 రోజుల్లో ప్రక్రియను పూర్తిచేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలు జారీ చేశారు. తాండూరు నియోజకవర్గంలో చారిత్రక తాండూరు నడిబొడ్డున ఉన్న భావిగి భద్రేశ్వర స్వామి, పొట్లి మహరాజ్, కాళికాదేవి, రసూల్‌పూర్ ఆంజనేయస్వామి నగరేశ్వరాలయం, స్టేషన్ హనుమాన్, బాలాజీ మందిర్, భద్రేశ్వర్‌చౌక్ ఆంజనేయాలయం, యాలాల మండలం జుంటుపల్లి రామస్వామి ఆలయం, బషీరాబాద్ మండల నీళ్లపల్లి ఏకాంబరేశ్వర రామలింగేశ్వర ఆలయాలకు చైర్‌పర్సన్లు, కమిటీ మెంబర్ల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. దరఖాస్తులను ఇప్పటికే రంగారెడ్డి దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆఫీసులో అందజేశారు. కోత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి కమిటీ ప్రక్రియ పూర్తయ్యింది. కొత్త పాలకమండళ్ల గడువు ఏడాది ఉంటుందని ప్రభుత్వం తన ఆదేశాల్లో పేర్కొంది. గతంలో ఈ గడువు మూడేళ్లుండేది. దానికి రెండేళ్లకు ఇప్పుడు ఏడాదికి కుదించారు.

భద్రేశ్వరాలయానికి అభివృద్ధి కమిటీ

తాండూరు భద్రేశ్వర్ ఆలయానికి పాలకమండలి ఏర్పాటుపై కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో పూర్తిస్థాయి పాలకమండలి కాకుండా ఈ గుడికి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తారు. భద్రేశ్వరాలయ జాతరను ప్రతీ ఏట నిర్వహిస్తారు. కొంత కాలంగా పాలకమండళ్లు కాకుండా అభివృద్ధి కమిటీని నియమించి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

ప్రతిపాదనల్లో పలువురు పేర్లు

భద్రేశ్వరాలయ అభివృద్ధి కమిటీకి వీరశైవ యువదళ్ నాయకుడు పటేల్ కిరణ్ పేరును చైర్మన్‌గా ప్రతిపాదించారు. పొట్లి మహరాజ్ ఆలయానికి ప్రసాద్‌గౌడ్, కాళికాలయానికి మాజీ కౌన్సిలర్ బస్వరాజ్, స్టేషన్ హనుమాన్ ఆలయానికి మిస్కిన్ శంకర్, నగరేశ్వర దేవాలయానికి దాదాపూరం సతీష్ పేర్లను ఇప్పటికే జిల్లా ఎండోమెంట్ కార్యాలయానికి పంపినట్టు తెలుస్తోంది.

కమిటీలకు ఇంకా ఉత్తర్వులు రాలేదు

జిల్లాలోని ఆలయాలకు పాలక మండళ్ల నియామకంపై ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ అక్టోబరు 10న నోటిఫికేషన్ ఇచ్చారు. నిమాయకాలకు సంబంధించి ప్రభుత్వానికి ఇప్పటికే పలువురి పేర్లను ప్రతిపాదించారు. సర్కారు నియామకాలకు ఉత్తర్వు రావాల్సి ఉంది. అయితే త్వరలో ఉత్సవాలు జరగనున్న భద్రేశ్వరాలయానికి మాత్రం అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయనున్నారు.

- శేఖర్‌గౌడ్, ఎండోమెంట్ ఈఓ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


చారును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

యాలాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. బుధవారం గంగసాగర్‌లో అసైన్డ్ భూమిని పరిశీలించారు. అనంతరం రాస్నం అంగన్‌వాడీ కేంద్రాన్ని, భాగాయిపల్లిలోని పాఠశాలను తనిఖీచేశారు. మధ్యాహ్నం విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టాలని వంటవారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎంకు భోజనంపై సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ అంజయ్య, ఆర్‌ఐ చరణ్ ఉన్నారు.

భూ కైలాస్ ఆలయాన్ని దర్శించుకున్న సబ్ కలెక్టర్

తాండూరు రూరల్: అంతారం భూకైలాస్ మహాశివుడిని సబ్ కలెక్టర్ ఉమాశంకర్, ఆయన కుటుంబీకులు సందర్శించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. పూజారి రవి సబ్‌కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలను అందజేశారు.


వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌గౌడ్

స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

తాండూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వర్‌రావును బుధవారం బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, తాండూరు వాసి ఈడిగ శ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని, జనాభాలో 55శాతానికిపైగా ఉన్న బీసీలకు 18శాతమే రిజర్వేషన్ ఇస్తున్నారన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను పెంచి స్థానికసంస్థల ఎన్నికలు పెట్టాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా కాలయాపన చేయొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరేష్, నర్సింహ, చందు ఉన్నారు.


ప్రపంచ బాలల దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా ప్రపంచ బాలల దినోత్సవం

కీసర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ పద్మజారావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. విద్యార్థులు బాగా చదివి నవసమాజ నిర్మాణానికి కృషిచేయాలన్నారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి

డిసెంబరు 19 నుంచి 22వరకు ఇసామి ఫోరం సమావేశం

ఆమనగల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో డిసెంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇసామి ఫోరం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ సండడి నరేందర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ కోటేశ్వర్ రావు, మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డిలు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న సమావేశాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేందర్‌రెడ్డి, కోటేశ్వర్ రావు, చెన్నకిషన్ రెడ్డిలు మాట్లాడుతూ దేశస్థాయి లయన్ ఇసామి ఫోరం సమావేశానికి ప్రముఖులు హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో లయన్స్‌క్లబ్ జిల్లా వైస్‌గవర్నర్ మహేంద్రకుమార్ రెడ్డి, జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ సత్యనారాయణ, రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను, తదితరులున్నారు.

యువత శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అగ్రగామి దిశగా భారత్
- రక్షణశాఖ సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాబోవు కాలంలో భారత్ అగ్రగామిగా నిలవనుందని రక్షణ శాఖ సాంకేతిక సలహాదారు, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ యూత్ సౌజన్యంతో బుధవారం ఇన్‌స్పైర్ ఇండియా డిఫెన్స్, స్పేస్ కన్వెన్షన్-2024 సదస్సు నిర్వహించారు. సతీష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలోని యువతకు డిఫెన్స్, స్పేస్ రంగాల్లో అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు దోహదపడతాయని చెప్పారు. యువత భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. డిఫెన్స్, స్పేస్ రంగాల్లో విద్యార్థుల అభిరుచిని పెంపొందించేందుకు కృషి చేస్తున్న విద్యాలయాల యాజమాన్యాలను అభినందించారు. డా.రాజాసింగ్ తంగదురై, ప్రోగ్రాం డైరెక్టర్ డా.అశోక్‌కుమార్ పాండే, కె.శ్రీనివాసరాజు, సీఈవో జి.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఫాజిజ్, గ్రూప్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సెమినార్‌లో పాల్గొన్న డాక్టర్ సతీష్‌రెడ్డి తదితరులు


టీడీపీ సభ్యత్వం ఇస్తున్న బక్కని నర్సింహులు, భూపాల్‌రెడ్డిలు

తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తేవాలి

రాజేంద్రనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, మాజీ ఎంపీ కంబంపాటి రామ్మోహన్‌రావు, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డిలు అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి సామ భూపాల్‌రెడ్డి గార్డెన్స్‌లో బుధవారం టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కె.వెంకటేశ్ గౌడ్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. అందుకు ముందు పార్టీ నాయకులు టీడీపీ జెండాను ఎగురవేశారు. పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకుడు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ, టీడీపీకి రాబోయే రోజుల్లో తెలంగాణలో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహేశ్వరం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు రాఘవులు, ఎన్.వెంకటేశ్, అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వర్‘డౌన్’

యువర్ పేమెంట్ ఈజ్ అండర్ ప్రాసెస్.. ప్లీజ్ వెయిట్ 15 మినిట్స్

- టెట్ దరఖాస్తు చేస్తుంటే వెబ్‌సైట్‌లో దర్శనం
- నాలుగు రోజులుగా ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు
- మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ కేంద్రాల వద్ద పడిగాపులు
- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- గడువు పెంచాలని వేడుకోలు


టెట్ అప్లై చేయడానికి మీ సేవకు వచ్చిన అభ్యర్థులు

కేశంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలో టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) రాయాలనుకునే అభ్యర్థులు దరఖాస్తు కోసం నాలుగు రోజులుగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అప్లై చేస్తుంటే సర్వర్ డౌన్ అవుతుండటంతో మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. టెన్ దరఖాస్తు చేయాలంటే వెబ్‌సైట్‌లో ముందుగా వివరాలు నమోదు చేయాలి. అనంతరం పేమెంట్ చేయాల్సి ఉంటుంది. అయితే అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్ చేసి పేమెంట్ చేయడానికి ప్రయత్నిస్తే యువర్ పేమెంట్ ఈజ్ అండర్ ప్రాసెస్ ప్లీజ్ వెయిట్ 15 మినిట్స్ అంటూ వెబ్‌సైట్‌లో దర్శనమిస్తుంది. ఇలా ఎన్నిసార్లు ప్రయత్నించినా ఇలాగే వస్తుండడంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం టీజీటెట్ 2024 (సెకండ్ ఫేస్) నిర్వహించడానికి ఈ నెల మొదటి వారంలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 7 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో అభ్యర్థి ఫీజు చెల్లించి, తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపింది. టీజీ టెట్ 2024 (ఫస్ట్ ఫేస్) రాసిన అభ్యర్థులకు ప్రస్తుతం నిర్వహించే టెట్‌లో ఫీజులో మినహాయింపు ఇచ్చింది. బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారితో పాటు ఫైనల్ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు కూడా పరీక్ష రాసుకోవడానికి అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలతో 7వ తేదీ నుంచి మొదలైన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ 16వ తేదీ వరకు సజావుగా సాగింది. 17వ తేదీ నుంచి టెట్ సర్వర్ డౌన్ అయ్యింది. అడపాదడప వస్తున్నా పేమెంట్ చేసే క్రమంలో డౌన్ అవుతుంది. దీంతో వివరాలు నమోదు చేయలేక అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. టెట్‌కు పూర్తి వివరాలను నమోదు చేయాలంటే మొదట పేమెంట్ చేయాల్సి ఉంటుంది. అనంతరం ఇతర వివరాలను నమోదు చేసుకునే ఆవకాశం ఉంటుంది. సర్వర్ డౌన్ కావడంతో జిల్లాలో వేలాది మంది అభ్యర్థులు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వర్ డౌన్ కావడంతో అక్కడే పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ డౌన్ కావడంతో నాలుగు రోజులుగా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయలేకపోతున్నామని అభ్యర్థులు వాపోతున్నారు. ఎంతో కాలంగా టెట్ రాయడానికి ఎదురుచూస్తున్నామని, సర్వర్ డౌన్ కావడంతో టెట్ రాసే ఆవకాశం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం టెట్ గడువును పొడిగించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.



సర్వర్ డౌన్ ఉన్నట్లు కనిపిస్తున్న దృశ్యం

సర్వర్ రావడం లేదు



టెట్ అప్లికేషన్ చేయడానికి సర్వర్ రావడం లేదు. నాలుగు రోజులుగా ఇదే తంతు. దరఖాసుత చేసుకోవడానికి వచ్చిన అభ్యర్థులు మీసేవ కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. వెబ్‌సైట్‌లో టెక్నికల్ సమస్యలు గుర్తించి, టెక్నికల్ సిబ్బందితో మాట్లాడినా సమస్య పరిష్కారం కావడంలేదు. వెబ్‌సైట్ రాకపోతే మేం చేసేదేమీ లేదు.

శ్రీనివాస్, మీసేవ నిర్వాహకుడు, కేశంపేట

టెట్ దరఖాస్తు గడువు పొడిగించాలి



టెట్ అప్లికేషన్ చేయడానికి మీ సేవకు వెళ్తే సర్వర్ డౌన్‌లో ఉందని చెబుతున్నారు. నాలుగు రోజులుగా సర్వర్ డౌన్ ఉంటే ఫీజు ఎలా చెల్లించాలి. బుధవారంతో టెట్ అప్లికేషన్ చేయడానికి గడువు ముగిసింది. అధికారులు స్పందించి వేలాది విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని టెట్ అప్లికేషన్ గడువును పొడిగించాలి.

జి. విజయలక్ష్మి, కేశంపేట

వరి కొయ్యలను కాల్చొద్దు


అంతారం తండాలో వరి కొయ్యను పరిశీలిస్తున్న డీఏవో మోహన్‌రెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వానకాలంలో వేసిన వరిని కోసి రైతుల కొయ్యకాళ్లకు నిప్పుపెట్టొద్దని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం అంతారం తండాలో వరి కొయ్యలను ఆయన పరిశీలించారు. రైతులు కొయ్యకాళ్లను కాల్చుతుండాన్ని చూసి వారితో మాట్లాడారు. వరికొయ్యను కాల్చితే భూమిలోని నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు కాలిపోతాయని చెప్పారు. వరి కొయ్యల పొగతో వాయు వాయుకాలుష్యం ఏర్పడి కార్బన్‌డయాక్సైడ్‌తో ఊపిరితిత్తుల సమస్యలకు దారితీస్తుందన్నారు. అలాగే మట్టిలో ఉండే పంటలకు మేలుచేసేసూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. వరి కొయ్యలు కాలిస్తే ఇన్ని రకాలు నష్టం ఉంటుందని వివరించారు. కాబట్టి రైతులు కొయ్యకాళ్లను కాల్చకుండా అవి భూమిలో కలిసేలా కలియదున్నాలని సూచించారు. అనంతరం రైల్వే ఫ్లైఓవర్ సమీపంలోని ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏవో కొమరయ్య ఉన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: వరికోతల అనంతరం కొయ్యకాళ్లను కాల్చితే వాయు కాలుష్యం ఏర్పడుతుందని ఘట్‌కేసర్ ఏవో బాసిత్ అన్నారు. ఎదులాబాద్‌లోని రైతువేదిలో రైతులతో మాట్లాడుతూ కొయ్యకాళ్లను కాల్చడం వల్ల భూమిలోని నత్రజని, భాస్వరం, పొటాషియం, ఇతర సేంద్రియ పదార్థాలు, మిత్ర పురుగులు నాశనం అవుతాయన్నారు. ఏఈవో జగదీష్, రైతులు పాల్గొన్నారు.

మేథస్సు, శ్రమతోనే అద్భుతాల సృష్టి



సుబ్రహ్మణ్యాన్ని సన్మానిస్తున్న గోవిందరెడ్డి

కీసర రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మేథస్సుకు శ్రమను జోడిస్తే అద్భుతాలను సృష్టించొచ్చని సీరో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ జీఎం డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం రాంపల్లిలోని కేజీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీలో నూతనంగా ఫార్మసీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. దేశం ఫార్మా ఉత్పత్తుల్లో అగ్రస్థానంలో ఉందన్నారు. కాలానుగుణంగా టెక్నాలజీని పెంపొందించుకుంటూ ఉద్యోగాలు సాధించాలన్నారు. కళాశాల చైర్మన్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభ చూపే ప్రతీ విద్యార్థికి కళాశాల అనుబంధ ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలిస్తామని తెలిపారు. కీసర సీఐ వెంకటయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు చట్టాలకు లోబడి విద్యాభ్యాసాన్ని పూర్తి చేయాలని, చట్టవ్యతిరేక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాలేజి డైరెక్టర్ రమణారావు, ప్రిన్సిపాల్ విజయకుమార్, శిల్పిక, నాగరాజు, సింధూజ, రాధిక, సుసాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

లగచర్ల గిరిజనులకు సంఘీభావం

- కడ్తాలలో బీఆర్‌ఎస్ గిరిజన నేతల ర్యాలీ

కడ్తాల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా లగచర్ల గిరిజనులకు మద్దతుగా బుధవారం కడ్తాల మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ గిరిజన నేతలు సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అల్లుడి స్వలాభం కోసం సీఎం అమాయక గిరిజనుల భూములను ఫార్మా పేరుతో లాక్కోవడానికి చూస్తున్నారని మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, బీఆర్‌ఎస్ ఆమనగల్లు పట్టణాధ్యక్షుడు పత్యానాయక్, మాడ్గుల మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్‌లు ఆరోపించారు. అనంతరం దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో లగచర్లకు తరలి వెళ్లారు. నాగులు, లచ్చిరామ్ నాయక్, సేవ్యనాయక్, తులసీరామ్ నాయక్, లోకేశ్ నాయక్, హరిచంద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్ అర్బన్ : పోలీసుల అదుపులో రాంబల్‌నాయక్, గిరిజన సంఘాల నాయకులు

లంబాడీల భూముల జోలికొస్తే తిరగబడతాం

షాద్‌నగర్ అర్బన్/కొత్తూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి లంబాడీల భూముల జోలికొస్తే తిరుగుబాటు తప్పదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ హెచ్చరించారు. చలో లగచర్ల కార్యక్రమానికి ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్రశాఖ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఎల్‌హెచ్‌పీఎస్, గిరిజన సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి, రాణాకు తరలించారు. రాంబల్‌నాయక్ మీడియాతో మాట్లాడుతూ ప్రైవేట్ ఫార్మా కంపెనీలకు ధారాదత్తం చేయడానికి లగచర్లలోని 1,300 ఎకరాల గిరిజన భూములను లాక్కోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుందన్నారు. గిరిజనులపై కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇకముందు గిరిజనుల భూముల జోలికొస్తే ఆందోళన తప్పదని రాంబల్‌నాయక్ హెచ్చరించారు. గిరిజన సంఘాల నాయకులు విస్లావత్ చందర్‌నాయక్, జర్పుల లింబ్యానాయక్, వి. చందునాయక్, లక్ష్మణ్‌నాయక్, తదితరులు అరెస్టయిన వారిలో ఉన్నారు. అలాగే చలో లగచర్ల సందర్భంగా కొత్తూర్ ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సాయంత్రం వదిలిపెట్టారు. నాయకులు లక్ష్మణ్‌నాయక్, గోపాల్‌నాయక్, మోహన్‌నాయక్, నర్సింహ, బలరాం, చందర్‌లను అరెస్ట్ చేశారు.


కార్తీకదీప పూజలు చేస్తున్న దినేష్‌రెడ్డి

కార్తీక దీపోత్సవంలో మాజీ డీజీపీ

కీసర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):కార్తీక మాసోత్సవంలో భాగంగా బుధవారం కీసర గుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో ఏపీ మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి పాల్గొన్నారు. మొదట గర్భాలయంలోని మూలవిరాట్టుకు రుద్రాభిషేకం నిర్వహించి, శివదుర్గ అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- నిర్వహణను గాలికొదిలేసిన పంచాయతీ సిబ్బంది
- పొదలతో కూడిన మైదానాల్లో ఆడలేకపోతున్న యువకులు



నాగరంలోని క్రీడా ప్రాంగణంలో మొలిచిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు

కొడంగల్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని, వారు ఆటలాడుకునేందుకు సౌకర్యాలు కల్పించేందుకని ప్రభుత్వం ప్రతీ గ్రామంలో ఓ మైదానాన్ని ఏర్పాటు చేసింది. వాటికి క్రీడా ప్రాంగణాలుగా నామకరణం చేసి బోర్డు ఏర్పాటు చేశారు. అయితే వాటిల్లో సదుపాయాలు మాత్రం కల్పించలేదు.పేరుకు క్రీడామైదానం అన్న బోర్డు మాత్రం పెట్టారు. గ్రామ సమీపంలో వృథాగా ఉన్న ప్రభుత్వ భూముల్లో వీటిని ఏర్పాటు చేశారు. అయితే చాలా గ్రామాల్లోని క్రీడాప్రాంగణాల్లో ఆటలాడటం లేదు. వాటి నిర్వహణనూ పట్టించుకోవడం లేదు. మైదానాల్లో పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు పెరిగాయి. మైదానాలేర్పాటు చేసిన చోట్ల చిన్న రూమ్ కూడా నిర్మించలేదు. క్రీడా పరికరాలేవీ అందుబాటులో ఉంచలేదు. దీంతో క్రీడాప్రాంగణాలను వినియోగించుకునేందుకు యువకులు ఆసక్తి చూపడం లేదు. ఇక్కడ కనిపిస్తున్న క్రీడా ప్రాంగణం సైతం అలాంటిదే. ఇది క్రీడాకారులకు ఉపయోగంలో లేకుండా ఉంది. కొడంగల్ మండలం నాగారం శివారులో విశాల స్థలంలో క్రీడామైదానాన్ని ఏర్పాటు చేశారు. దీని నిర్వహణను పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. మైదానంలో పిచ్చి మొక్కలు, పొదలు పెరిగాయి. ఆటలాండేందుకు మైదానం అనువుగా లేదు. ఈ మైదానాన్ని చదును చేసి వాలీబాల్ నెట్‌కు పోల్స్ పాతాలని గ్రామ యువకులు కోరుతున్నారు. క్రీడా పరికరాలను పెట్టుకునేందుకు గ్రౌండ్ వద్ద చిన్న షెడ్ కట్టిస్తే విద్యార్థులకు అనువుగా ఉంటుందంటున్నారు.

అందరికీ లబ్ధి జరిగేలా పథకాల అమలు



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి జరిగేలా పథకాలు అమలు చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పరిగిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను దశల వారీగా అమలు చేస్తామన్నారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యానాయక్, తహసీల్దార్ ఆనంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

దోమ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఎంపీడీవో మహేశ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాయిపల్లిలో సర్వే, ఊటుపల్లిలో నర్సరీ పనులు, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఉత్తమంగా బోధించాలని, మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో మృతిచెందిన యాదయ్య

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన మోటె యాదయ్య(50) లారీ అవుషాపూర్ కేసీఆర్ పార్కు సమీపంలో టైర్ పగిలిపోయిం ది. దీంతో అతడు లారీని రోడ్డు పక్క ఆపి పరిశీలిస్తుండగా వేగంగా వచ్చిన బైక్ యాదయ్యను ఢీకొట్టింది. దీంతో అతడి తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బీబీనగర్ మండలం జైనపల్లికి చెందిన ద్విచక్ర వాహనదారుడు శివరామకృష్ణ నిర్లక్ష్యంగా నడపంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. శివరామకృష్ణకూ గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరి మృతి



కొట్టుమిట్టాడుతున్న ఏలేందర్

కీసర రూరల్, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువుతో పోరాడి చివరికి ప్రాణాలొదిన ఘటన బుధవారం కీసర మండలంలో చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో వ్యక్తి తీవ్రగా గాయపడి చివరికి ప్రాణాలొదిలాడు. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాంపల్లి చౌరస్తాలో ఉండే వారిమాట్ల ఏలేందర్(35) కీసర వైపునకు తన టూ వీలర్‌పై వెళ్తూ కీసరలోని అవుటర్ రింగ్ రోడ్డు వద్ద చేరుకొన్నాడు. వెనన నుంచి టిప్పర్ లారీ వేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. దీంతో ఏలేందర్ కిందపడగా కాళ్లపై నుంచి లారీ టైర్ వెళ్లింది. ఏలేందర్ రెండు ఛిద్రమై రక్త స్రావమైంది. కొద్దిసేపు అతడు అల్లాడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకొని ఏలేందర్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

నవాబుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. నవాబుపేట మండలం ఆర్కతలలో అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను మంగళవారం రాత్రి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, జేసీబీలను పట్టుకొని మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతుల్లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

ఘనంగా జిందా షా మదార్ ఉర్సు



దర్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

మేడ్చల్ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని హజ్రత్ జిందా షా మదార్ బాబా ఉర్సు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దర్గా సందల్(గంధం), పూల దట్టీ(చాదర్), నషాన్(జెండా)ను ఊరేగింపుగా తెచ్చి దర్గాకు కప్పారు. అనంతరం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉర్సు వేడుకల్లో పాల్గొనేందుకు మేడ్చల్ పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కుల మతాలకు అతీతంగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గా మసీదు కమిటీ అధ్యక్షుడు జమాల్ ఖురేషి, ప్రధాన కార్యదర్శి ఇనాయత్, నాయకులు లాయక్ అలీ, అబేద్, ఖాలేద్, అశ్రఫ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



చెంగోల్ కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని తూకం చేస్తున్న నిర్వాహకులు, రైతులు

తాండూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. తాండూరు మండలంలో ఏడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. తాండూరులోని డీసీఎంఎస్ గోదాం ఆవరణలో ఒకటి, చెంగోల్, బెల్కటూర్, గోనూరు, యాలాల మం డలం బెన్నూరు, పెద్దేముల్ మండలం జనగాం, మంబాపూర్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఇప్పటి వరకు చెంగోల్‌లో 14,62 బస్తాలు, గోనూరులో 600, మంబాపూర్‌లో 1,317, బెన్నూరులో 1,081 బస్తాల చొప్పున కాంట వేశారు.

సన్న రకానికి వేరే కేంద్రం ఏర్పాటు

దొడ్డు, సన్న రకాల వడ్లు కలవకుండా వేర్వేరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. బెల్కటూర్‌లో సన్న వడ్లు కొంటున్నారు. అయితే ఇప్పటి వరకు ఇక్కడ సన్న వడ్లు రాలేదు. సన్న వడ్లు క్వింటాలుకు రూ.2,320 అదనంగా 500 బోనస్, ఎ-గ్రేడ్ వడ్లకు రూ.2,320, దొడ్డు రకాలకు రూ.2,300 ఇస్తున్నారు. డీసీఎంఎస్ గోదాంఇన్‌చార్జి ఎల్లప్ప మాట్లాడుతూ.. వడ్లను శుభ్రపరిచి, ఎండబెట్టి కేంద్రాలకు తేవాలన్నారు. సన్నరకం వడ్లు తెచ్చేవారు ఏవో ధ్రువీకరణ పత్రం తేవాలన్నారు. అలా చేస్తేనే రైతుకు 500 బోనస్ వస్తుందన్నారు. రెండు రోజుల్లో పెద్దేముల్ మండలం జనగాంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

సర్వేలో కుటుంబ వివరాలు నమోదు చేసుకున్న ఎమ్మెల్యే



సర్వే వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సకుటుంబ కుల గణన సర్వేలో భాగంగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వివరాలు నమోదు చేసుకున్నారు. బుధవారం తాండూరు శాంతినగర్ కాలనీలోని ఆయన గృహం వద్ద తన తల్లి, తనయుడుతో కలిసి ఎన్యుమరేటర్‌కు వివరాలను తెలిపారు. ప్రతి ఒక్కరు సర్వేకు సహకరించాలని కోరారు. అనంతరం సర్వే ఫార్మాట్‌లో సంతకం చేశారు.

కుటుంబ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

పరిగి రూరల్: సమగ్ర కుటుంబ సర్వేను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పరిగి మండల కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు తావుర్యానాయక్ అన్నారు. సుల్తాన్‌పూర్‌తండాలో సర్వేలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజల ఆర్థిక, సామాజిక, విద్య తదితర విషయాలు సర్వేతో తెలుస్తాయన్నారు. ఎస్టీలంతా సర్వేలోని 70 కాలాలను పరిశీలించి ఎన్యుమరేటర్‌కు వివరాలు తెలిపాలని సూచించారు. మాతృభాషను లంబాడ, గోర్‌బోలి అని రాయించాలని సూచించారు. ఫారం నింపిన తర్వాతే సంతకం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు శ్రీనివాస్, పాండు, శీను, సీతారాం, బాబురావు, డాన్సింగ్ పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



పూజల్లో పాల్గొన్న వేద పండితులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):ఎదులాబాద్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవార గణపతి శివలింగం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ధర్మకర్తలు కంట్లం శంకరప్ప, ఓంప్రకాష్‌ల ఆధ్వర్యంలో గణపతి, శివలింగ విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు అంబారిపేట వరదరాజులు, శ్యామ్ కుమార్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

దోమ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దోమలోని ఆరోగ్య కేంద్ర వైద్యుడు సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలోబుధవారం జడ్పీహెచ్ఎస్‌లో ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 6, 7వ తరగతుల విద్యార్థులకు రక్త హీనత, హిమోగ్లోబిన్ మందులు పంపిణీ చేశారు. ఎంఈవో వెంకట్, హెచ్ఎం షఫీ, ఏఎన్ఎం నూరమ్మ పాల్గొన్నారు.

మద్గుల్ చిట్టంపల్లిలో అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

వికారాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మద్గుల్ చిట్టంపల్లిలో బుధవారం అయ్యప్ప పడిపూజ కనుల పండువగా జరిగింది. కన్నెస్వామి చందు ఆధ్వర్యంలో పూజ నిర్వహంచగా వందల మంది స్వాములు వచ్చి పూజల్లో కూర్చున్నారు. రవి పంతులు ఆధ్వర్యంలో భజన పాటలు పాడారు. అనంతరం స్వాములకు బిక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నవీన్‌కుమార్, గురుస్వాములు శ్రీనివాస్, స్వాములు బాలు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడులతో శబరిమలకు స్వాములు

మోమిన్‌పేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్కతలలో అయ్యప్ప స్వాములు బుధవారం బక్కప్ప ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడులు ధరించి కేరళ రాష్ట్రంలోని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. స్వాములు మహిపాల్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, మణికంఠ, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

అనురాగ్‌లో ఫార్మసీ వారోత్సవాలు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్‌లో గల అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం 63వ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు రక్తదానం చేశారు. ఫార్మసీ డీన్ వసుధభక్తి మాట్లాడుతూ.. జాతీయ ఫార్మసీ వారోత్సవాల నేపథ్యంలో యూనివర్సిటీలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శిబిరంలో 120యూనిట్ల రక్తాన్ని సేకరించి ఆరాధ్య రక్తనిధికి అందజేసినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజేంద్రకుమార్, మల్లేష్, సయిాద్, సంతోషి పాల్గొన్నారు.

చౌడాపూర్ ఏవోగా పరిమళ



నూతన ఏవోను సన్మానిస్తున్న రైతులు, స్థానికులు

కులకచర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):చౌడాపూర్ మండల వ్యవసాయ అధికారిగా పరిమళ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కులకచర్ల ఏవో వీరస్వామి ఇంచార్జిగా వ్యవహరించారు. ప్రస్తుతం రెగ్యులర్ ఏవోగా పరిమళ నియమితులయ్యారు. రైతులు నూతన ఏవోను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విశ్వనాథం, రైతులు పాల్గొన్నారు.

వంగడాల తయారీలో నూజివీడుకు గుర్తింపు



నూతన వరి వంగడాన్ని ప్రారంభిస్తున్న నూజివీడు సీడ్స్ సంస్థ ప్రతినిధులు

మేడ్చల్ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులు ఇచ్చే వంగడాల తయారీలో తమ సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉందని నూజివీడు సీడ్స్ లిమిటెడ్ చీఫ్ స్ట్రాటజీ అధికారి దేవేందర్ కడియన్ అన్నారు. బుధవారం కండ్లకోయలోని నూజువీడు కార్యాలయంలో పరిశ్రమ ఆర్‌అండ్‌డీలో కనుగొన్న ఎన్‌పీ-8912 వరి వంగడాన్ని ఆవిష్కరించారు. తెగుళ్లను తట్టుకొని ఎక్కువ దిగుబడి వచ్చేలా వంగడాన్ని రూపొందించామన్నారు. కార్యక్రమంలో సీడ్స్ ప్రత్యేకాధికారి శరత్‌ఖురానా, ఆర్‌అండ్‌డీహెడ్ వరప్రసాద్, రైస్ బ్రీడింగ్ హెడ్ శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కడా ప్రత్యేకాధికారికి తిరుపతిరెడ్డి పరామర్శ



కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో ఇటీవల అధికారులపై జరిగిన దాడిలో గాయపడిన కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పరామర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో వెంకట్‌రెడ్డిని పరామర్శించారు. దాడి సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు.

భద్రత కోసమే సీసీ కెమెరాల ఏర్పాటు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత కోసమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ పరశురాం తెలిపారు. ఘట్‌కేసర్, బాలాజీనగర్ గీతా మందిర్‌లో బుధవారం ఆయన 8సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పౌరుల భద్రత కోసమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగతంగా వీలు కాకపోతే కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు వ్యాసరచన పోటీలు

ధారూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ధారూరులోని జడ్పీ బాలికల, కేజీబీవీల్లో సాధన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల్య వివాహాలతో జరిగే అనార్థాలపై వ్యాసరచన నిర్వహించారు. బాలికల పాఠశాలలో 20మంది, కేజీబీవీలో 26విద్యార్థినులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కేజీబీవీ ఎస్‌వో స్రవంతి, ఇన్‌చార్జి హెచ్ఎం స్వప్న, అంజయ్య పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో కేజీబీవీ విద్యార్థినులు

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని మేడపల్లి సీఐ గోవిందరెడ్డి తెలిపారు. ప్రతాప్‌సింగారం ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన విధంగా నడుచుకోవాలన్నారు. లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, ఎస్ఐ తిరుపతయ్య, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంఏ జిల్లా అధ్యక్షుడిగా హరిలాల్

వికారాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా జీహెచ్ఎంఏ అధ్యక్షుడిగా హరిలాల్, ప్రధాన కార్యదర్శిగా రామ్‌రెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం వికారాబాద్ క్లబ్ హాల్‌లో టీఎస్ జీహెచ్ఎంఏ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్‌లో ఐదు అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు బుధవారం తెల్లవారుజామున కూల్చారు. బఫర్‌జోన్‌లోని నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి ఆదేశాలతో పాక్షికంగా ధ్వంసం చేశారు.

భూదాన్ భూముల చెర!

(5వ పేజీ తరువాయి)

పంటలు సాగు చేసుకున్నారు. ఆ తర్వాత బెదిరింపులకు గురి చేసి వారిని పొజిషన్ నుంచి తప్పించి ఇతరుల చేతుల్లోకి తీసుకున్నారు.

తిరిగి పట్టాలు ఇప్పించేవరకు

2005-06 వరకు భూదాన్ బోర్డు కేటాయించిన పేర్లే రికార్డుల్లో వస్తున్నాయి.ఆ తర్వాత అప్పట్లో మొదట పట్టదారుల వారసులు ఆ భూములు బాగా లేవు, మరోచోట చూపిస్తానని పొజిషన్‌లోని రైతులను నమ్మించి వారిని వెళ్లిపోయేలా చేశారు. తర్వాత చెన్నప్ప, శంకరప్ప వారసులు విజయశంకర్, ప్రభులింగం, సుధీర్ రికార్డుల్లోకి వచ్చారు. వీరి నుంచి 32.32 ఎకరాలను జి.రామయ్య, భూదేవి, రామారావు, అమీనా, జహీరా, రాములమ్మ,నాగిరెడ్డి,నరేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి కొన్నారు. ఈ తొమ్మిది మంది పేర్ల మీద నుంచి 2007, 2008లలో వివిధ డాక్యుమెంట్ల ద్వారా 9.15ఎకరాలు ఓ స్టీల్ కంపెనీ పేరిట, 23.07ఎకరాలు మెటల్ కంపెనీ పేరిట రిజిస్ట్రేషన్లు అయ్యాయి. అప్పటి నుంచి భూదాన్ భూములన్నీ ఇద్దరి ఆధీనంలోనే ఉన్నాయి. స్టీల్ కంపెనీలో 15ఏళ్ల కిందటే నిర్మాణాలు చేపట్టారు. ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఉన్న భూములు సైతం వారి ఆధీనంలో ఉన్నాయి. అయితే రైతులకు వేరేచోట భూమి చూపుతామని నమ్మించిన పట్టాదారు వారసులు, ఆ తర్వాత కన్పించలేదు. అప్పటి నుంచి పేద రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఈ భూములను ఆ తర్వాత కూడా భూదాన్ బోర్డు రెండోసారి సదరు రైతులకే ఇస్తూ పత్రాలను అందజేసింది. తాము సూచించిన రైతులకే భూములివ్వాలని భూదాన్ బోర్డు రెవెన్యూ శాఖకు లేఖ రాసిందని, దాని ఆధారంగా పట్టాలు ఇప్పించాలని బాధిత రైతులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

భూదాన్ భూములేనని తేల్చినా...

రైతులు కలెక్టర్, ఆపై ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేయడంతో రెవెన్యూ అధికారులు భూములను సందర్శించి భూదాన్ భూములేనని తేల్చారు. ఈ భూములను కబ్జాచేస్తే శిక్షార్హులని రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు కూడా. ఇదే భూమిలో ఓ స్టీల్ ఇండస్ట్రీ రన్ అవుతుండగా, మరో కంపెనీ పేరిట ఆధీనంలో ఉన్నది. తాము భూములను సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేశామని కంపెనీలు కోర్టు స్టే తెచ్చుకున్నాయి. స్టే గడువూ పూర్తయింది. భూదాన్ బోర్డు కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు సూచించినా ఇప్పటి వరకు బోర్డు ముందుకు సాగడం లేదు. ఉన్నతస్థాయి ఒత్తిళ్ల వల్లే అధికారులు చర్యలు చేపట్టడం లేదని చెబుతున్నారు. ఇదిలా ఉంటే రైతులు తమకు భూములిప్పించాలి కోరుతున్నారు.

రూ.80కోట్ల పైమాటే

ఈ భూములు ఎకరా రెండు కోట్లకుపైగా పలుకుతున్నాయి. పేదలకు అనుభవించాల్సిన భూమి బడాబాబుల చేతుల్లో ఉంది. ఈ మొత్తం భూమి విలువ రూ.80కోట్లకుపైనే ఉంటుంది. కొందరు నేతలే పారిశ్రామికవేత్తలకు వత్తాసు పలికి అప్పగించారనే ఆరోపణలూ వస్తున్నాయి.

భూమి కోసం ఏళ్లుగా పోరాడుతున్నం



భూదాన్ పట్టాలు పొందిన రైతులకు కొందరు మాయ మాటలు చెప్పి పొజిషన్ నుంచి తప్పించారు. ఆ తర్వాత రికార్డులు మార్చి ఇతరులకు విక్రయించారు. వీటి గురించి ఐదేళ్లుగా పోరాడుతున్నం. భూదాన్ బోర్డు నుంచి పొజిషన్ చూపించాలని తహసీల్దార్‌కు లేఖ పంపించే వరకు పోరాటం చేసినం. ఇంకా చేస్తున్నం. ఈ భూముల్లో కబ్జా చేసిన వారిని విడిపించే వరకు పోరాడతం.

- బందయ్య, బాధిత రైతుల సంఘం నాయకుడు, నారాయణపూర్

కోర్టు స్టే ఉంది, కౌంటర్ దాఖలు చేస్తాం



నారాయణపూర్‌లోని 143, 144, 145 సర్వే నంబర్లలో 32.32ఎకరాల భూమిపై విచారణ జరిపి భూదాన్ భూములుగా గుర్తించారు. రికార్డులు స్వాధీనం చేసుకుని బోర్డులు కూడా పెట్టారు. అప్పట్లో ఆయా కంపెనీల వారు స్టే తెచ్చుకున్నారు. మేము కూడా కౌంటర్ దాఖలు చేస్తాం. భూదాన్ భూములు క్రయ, విక్రయాలు నేరం. ఉన్నతాధికారుల సూచనలతో పొజిషన్ తీసుకునేందుకు చర్యలు చేపడుతాం.

- ఆనంద్‌రావు, తహసీల్దార్, పరిగి

అన్నీ అప్పులే.. ఆస్తుల్లేవ్

(5వ పేజీ తరువాయి)

సహకరించడం లేదని ఎన్యుమరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్తులు, కార్ల వంటి వివరాలు చెబితే ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఇబ్బందులు ఎదురవుతాయనే భయాందోళనలతో చాలా మంది సర్వేకు సహకరించడం లేదని తెలుస్తోంది. వాహనాలు లేవని, సొంతిల్లు లేక అద్దెకుంటున్నామని, భూములు కూడా లేవనే వెల్లడిస్తున్నట్లు సమాచారం. మరికొందరైతే ఏకంగా స్మార్ట్ ఫోన్ కూడా లేదని, ఇంట్లో టీవీ, వాషింగ్ మిషన్, ఫ్రిజ్ వంటి వివరాలు కూడా వెల్లడించేందుకు వెనుకాడుతున్నారు.

అవగాహన లేకనే..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వే నిర్వహిస్తున్నా ప్రజల నుంచి సరైనా సమాధానాలు రాబట్టలేక ఎన్యుమరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూములకు సంబంధించి తహసీల్దార్ ఇచ్చిన పట్టాలు, ఇంటి నంబర్ల లిస్టుతో సర్వేకు వెళితే బాగుండేదని ఎన్యుమరేటర్లు చెబుతుండటం గమనార్హం. సర్వేలో ప్రజల చెబుతున్న సమాచారంతో ఉపయోగం లేదని పేర్కొంటున్నారు. సర్వే వివరాలతో సంక్షేమ పథకాలు రావనే అపోహ వీడాలని, ఇతర ఇబ్బందులు ఉండవనే విషయాన్ని ముందుగానే ప్రజలకు అవగాహన కల్పిస్తే మేలు ఉండేదంటున్నారు. ప్రభుత్వం సర్వేపై అవగాహన కల్పిస్తూ, ఉన్నతాధికారులు సర్వే తీరుపై పరిశీలిస్తు ప్రజలకు వివరిస్తున్నా వివరాల వెల్లడికి ప్రజలు ముందుకురాకపోవడం గమనార్హం.

సంక్షిప్తంగా

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

బొంరాస్‌పేట్: మండలంలోని ఏర్పుమళ్ల పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. డీఈవోగా అక్షయ, ఎంఈవోగా నితిన్, హెచ్ఎంగా ధనుష్, హెచ్ఎంగా శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్ పర్సన్ వసంత, సర్దార్, కిషన్, ప్రశాంత్‌కుమార్, జ్యోతి, కుమార్ పాల్గొన్నారు.

రహదారిపై వాహనాల తనిఖీ

పూడూరు: మన్నెగూడ పోలీసు స్టేషన్ వద్ద బీజాపూర్-హైదరాబాద్ రహదారిపై పోలీసులు మోహరించారు. బుధవారం ప్రతీ తనిఖీలు చేశారు. లగచర్ల గ్రామం ముట్టడికి గిరిజనులు పిలుపునివ్వడంతో పోలీసులు వారిని అక్కడే నివారించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

వికారాబాద్: సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరం అని మునిసిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయకులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్, బ్లాక్ అధ్యక్షుడు అనంతరెడ్డి, మర్పల్లి మాజీ ఎంపీపీ నర్సిములు, కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి, మురళి, రాజ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, ఖలీద్, ఆనంద్, శివనంద్, నాయకురాలు పల్లవి, బుచ్చయ్య, బందయ్య, మల్లయ్య, రంగరాజు, హనుమంతు,రాజుగౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్ సీఐ బదిలీ

తాండూరు రూరల్: తాండూరు సబ్ డివిజన్‌లో రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి పరిగికి బదిలీ అయినట్టు సమాచారం. ఉత్తర్వులు జారీ అయినట్లు తెలుస్తోంది. అక్టోబరు 19న శ్రీనివాస్‌రెడ్డి సంగారెడ్డి నుంచి తాండూరు రూరల్ సీఐగా వచ్చారు. నెల రోజుల్లోనే ఆయన బదిలీ అయినట్టు సమాచారం.

ఆలయ అభివృద్ధికి విరాళం

కులకచర్ల:కులకచర్ల అయ్యప్ప ఆలయ అభివృద్ధికి ఇప్పయిపల్లి వాస్తవ్యులు హైదరాబాద్ వడ్డె ఆంజనేయులు దంపతులు రూ.51వేలను విరాళంగా ఇచ్చారు. ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి, గురుస్వాములు ఈశ్వరయ్య, సతీశ్ కుమార్, చంద్రశేఖర్, శివకుమార్‌గౌడ్, వెంకటయ్య, నందు, పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

కొడంగల్ రూరల్: ప్యాక్స్ ఆధ్వర్యంలో కొడంగల్‌లో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. హస్నాబాద్ సొసైటీలో ప్యాక్స్ చైర్మన్ కటకం శివకుమార్‌గుప్తా ప్లాంట్‌ను ప్రారంభించారు. నారాయణ, రాఘవేందర్‌రెడ్డి, బుగ్గప్ప, పకీరప్ప, ఎల్లమ్మ, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మోమిన్‌పేట్: ఎన్కతల, టేకులపల్లి, దేవరంపల్లి, చీమలదరి, చక్రంపల్లి, మక్తతండాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ వినోద్‌కుమార్ బుధవారం పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.